సాక్షి
వికారాబాద్
మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



అన్నదాతను ఆదుకునేదెవరు

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సమయనికి అకాల వర్షాలతో నేలపాలైంది. 8లో▸



పరిహారం ఇచ్చాకే..

పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వకుండా చేపడుతున్న పనులను వెంటనే ఆపేయాలని భూ నిర్వాసితులు కోరారు. 8లో▸



తగ్గిన నీళ్లు.. రైతు దిగాలు!

అసలే వేసవి కాలం.. ఎండలు తీవ్రమవ్వడంతో చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు గాను సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్‌గా ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇంటర్వ్యూ, డెమో ద్వారా జిల్లా స్థాయి కమిటీ ఎంపిక చేస్తోందని ఆయన తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు పదోన్నతి



కొడంగల్: కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌కు పదోన్నతి లభించింది. ఆయన గ్రేడ్–3 స్థాయి నుంచి గ్రేడ్–2 కమిషనర్‌గా ప్రమోషన్ పొందారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వీరభద్రేశ్వరుడి అలంకరణలో పరమశివుడు



అలంకరణలో స్వామివారు

తాండూరు టౌన్: పట్టణంలో కొనసాగుతున్న శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శివాలయంలోని పరమశివుడు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. కర్ణాటక రాష్ట్రం శిందగి శ్రీ వీరభద్రేశ్వర స్వామి అలంకరణలో ఉన్న శివున్ని బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

2025–26 నాటికి కోట్‌పల్లి కేజీబీవీ

ఎంఈఓ చంద్రప్ప



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: కరీంపూర్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కోట్‌పల్లి కేజీబీవీ హాస్టల్ భవనాన్ని 2025–26 విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. సోమవారం ఆయన భవన నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సైట్ ఇంజనీర్ కిషోర్‌కు సూచించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో సువిశాలంగా నిర్మిస్తున్నామని చెప్పారు. పనుల్లో జాప్యం చోటుచేసుకోకుండా వేగం పెంచాలన్నారు.

సీనియర్ సివిల్ జడ్జికి ఘనంగా వీడ్కోలు



రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న న్యాయవాదులు

షాద్‌నగర్: షాద్‌నగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సోమవారం సిద్దిపేట కోర్టులో జడ్జిగా పని చేసిన స్వాతిరెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న రాజ్యలక్ష్మికి బార్ అసోసియేషన్ సభ్యులు వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన స్వాతిరెడ్డికి న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్ రావు, న్యాయవాదులు కంచి రాజగోపాల్, గుండుబాయి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. ఇంకెన్నాళ్లు

గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల్లో మగ్గుతున్నాయి. దశాబ్ద కాలంగా సొంత భవనాలు లేక అద్దె భవనాలు, రెంట్ ఫ్రీ బిల్డింగ్స్‌లోనే నెట్టుకొస్తున్నాయి.

- జిల్లా వ్యాప్తంగా సగానికిపైగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువు
- తరచూ కేంద్రాలు మార్చుతుండడంతో ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు, గర్భిణులు, బాలింతలు



బుద్దాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

వికారాబాద్: చిన్నారులకు సేవలందించే అంగన్‌వాడీలకు గూడు గోడు తీరడం లేదు. చాలీచాలని వసతితో అగచాట్లు తప్పడం లేదు. జిల్లాలో సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ అంగన్‌వాడీ కేంద్రాలు దశాబ్దాలు గడుస్తున్నా మెజార్టీ సెంటర్లు సొంత భవనాలకు నోచుకోవడం లేదు. చాలా వరకు సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా.. మిగిలినవి (రెంట్ ఫ్రీ బిల్డింగ్స్) పాఠశాలలు, ఇళ్లు తదితర చోట్ల కొనసాగుతున్నాయి. ఇలాంటి చోట్ల పదే పదే కేంద్రాలు మార్చాల్సి వస్తుండడంతో అంగన్‌వాడీల నిర్వాహకులు, సేలవందుకునే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

గ్రామ సభలు, మండల, జిల్లా సర్వసభ్య సమావేశాలు, స్థాయి సంఘాల మీటింగ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించే సమీక్ష సమావేశాలు.. ఇలా అన్నింటిలోనూ అంగన్‌వాడీ సొంత భవనాల విషయంలో చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు నిర్మించిన భవనాలు జిల్లా పరిషత్, ఏసీడీపీ(అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం) నిధులతో నిర్మించారు. కాగా ఇటీవల స్థానిక సంస్థలు నిధుల లేమితో కొట్టుమిట్టాడంతో వారు సైతం చేతులెత్తేస్తున్నారు. ఈ విషయం చర్చకు వచ్చిన ప్రతీసారి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిపాదనలు పంపిస్తున్నామంటున్నారే తప్ప అవి మంజూరుకు నోచుకోవటంలేదు.

1,106 కేంద్రాలకు 468 కే సొంతగూడు

జిల్లాలో మొత్తం ఐదు వికారాబాద్, మర్పల్లి, పరిగి, తాండూరు, కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నా యి. జిల్లా వ్యాప్తంగా 1,106 కేంద్రాలు ఉండగా ఇందులో 468 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండడం గమనార్హం. జిల్లా పరిధిలో 56,900 మంది చిన్నారులకు 6,313 మంది గర్భిణులకు, 5,683 మంది బాలింతలకు సేవలందిస్తున్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు	సొంత భవనాలు	అద్దె భవనాలు	రెంట్ ఫ్రీ బిల్డింగ్స్	మొత్తం కేంద్రాలు
తాండూరు	145	54	80	279
కొడంగల్	9	92	133	234
వికారాబాద్	101	24	107	232
పరిగి	109	11	93	213
మర్పల్లి	104	04	40	148

ప్రతిపాదనలు పంపించాం



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక పోవడంతో కొన్ని చోట్ల అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ఇటీవల గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలానికి రెండు చొప్పున భవనాలు మంజూరు అయ్యాయి. ఉపాధి హామీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ భవనాలు నిర్మిస్తాం. మిగిలిన వాటికి సైతం సొంతభవనాలు నిర్మించేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేస్తాం.

– జయసుధ, జిల్లా ఇన్‌చార్జి అధికారి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ



మోమిన్‌పేట: సాంఘిక సంక్షేమ వసతి గృహంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

భూ సమస్యలకు పరిష్కారం

- జవాబుదారీతనం పెంపొందించేందుకు భూ భారతి చట్టం
- కలెక్టర్ ప్రతీక్ జైన్

మోమిన్‌పేట: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌తో ఉత్పన్నమైన సమస్యల పరిష్కారం కోసం భూ భారతి తీసుకువచ్చామన్నారు. రైతుల్లో అభద్రతా భావాన్ని తొలగించి జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. ఈ నూతన చట్టంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు, చేర్పులు, సాదా బైనామాలు వంటి సేవలు సులభతరం చేశారన్నారు. ప్రజలకు సరళంగా అర్థమయ్యేలా ఈ చట్టాన్ని రూపొందించినట్లు చెప్పారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులే రైతుల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని వివరించారు. భూ సమస్యలు పరిష్కారమైతే రైతు బీమా, రైతు భరోసా అందుతుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి నూతన చట్టం అమల్లోకి వస్తుందని చెప్పారు.

హాస్టల్ మరమ్మతుల పరిశీలన

అనంతరం ఆయన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో చేపట్టిన మరమ్మతులు, స్టోర్ రూంలోని సరుకులను పరిశీలించారు. బియ్యం నాణ్యతపై వార్డెన్ జైపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో మెనూ తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టరు అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఆర్ఐ గోవర్ధన్, సీనియర్ నాయకులు నరోత్తం రెడ్డి, సుభాష్ గౌడ్, సురేందర్, చంద్రయ్య, ఎరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించండి

అనంతగిరి: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన 140 దరఖాస్తులను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో భక్తజనం

కొనసాగుతున్న భద్రప్ప జాతర



లంకా దహనం వేడుకలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



సంతకు తీసుకువచ్చిన కాడెద్లు

- అట్టహాసంగా 'లంకా దహనం'

తాండూరు: తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో సోమవారం తెల్లవారు జామున లంకా దహన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఆదివారం రాత్రి ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని పురవీధుల మీదుగా ఊరేగించారు. వందలాది మంది భక్తుల సమక్షంలో ఊరేగింపు బస్వణ్ణకట్ట సమీపంలోని లంకా దహన ప్రాంగణానికి చేరుకొంది. ఉత్సవాలకు హాజరైన కాంగ్రెస్ నాయకుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి లంకా దహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్‌తో కలిసి పల్లకీ సేవ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ప్రారంభమైన పశుప్రదర్శన

భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పశువుల సంత ఓ ప్రధాన ఘట్టం. రైతులు చైత్రమాసంలో పొలాలను దుక్కి దున్నే సమయమైనందున ఉత్సవాలకు కాడెద్లను తీసుకువస్తారు. సోమవారం రోజు ఆలయ కమిటీ ప్రతినిధులు పశు ప్రదర్శన కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి ప్రారంభించారు. వారం రోజుల పాటు సాగే ఈ సంతకు జిల్లాతో పాటు కర్ణాటక సరిహద్దు గ్రామాలు, మహారాష్ట్ర విదర్భా నుంచి ఎద్దులను తీసుకువచ్చారు. ఒక్కో జత ఎద్దులకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల ధర పలుకుతున్నాయి. వారం రోజుల పాటు సాగే ఉత్సవాల్లో సూమారు రూ.కోటి వరకు వ్యాపారం జరుగుతుంది.

మే 15న 'చలో ఇందిరా పార్క్'



జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకన్నకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

- మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాసయ్య

అనంతగిరి: ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బాని బాసయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మే 15న చేపట్టనున్న మత్స్యకారుల మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకన్నకు ఇందుకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాసయ్య మాట్లాడుతూ.. నగరంలోని ఇందిరాపార్క్ వద్ద మే 15న చలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని చేపడతున్నామన్నారు. ఈ ధర్నాలో ప్రతీ మత్స్య కార్మికుడు పాల్గొని విజయవంతం చేయా లని కోరారు. జంగయ్య, అనంతయ్య, సాయి, మల్లేష్, కోట్‌పల్లి సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, రమేశ్, గోవింద్, రాములు, నర్సింలు, అంబదాస్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



అనంతగిరి: కొత్తగడి సమీపంలో ప్రధాన రహదారిపై విరిగిపడిన భారీ వృక్షం

- రైతన్న హైరానా
- తడిసిన ధాన్యం.. నేల రాలిన మామిడి
- రోడ్లపై కూలిన వృక్షాలు
- ఇబ్బందులు పడిన కర్షకులు, ప్రయాణికులు

దోమ: మండల పరిధిలో సోమవారం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో రోడ్లపై వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రైతులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పాలేపెల్లి మార్గంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం విరిగి పడడంతో గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రాకొండ గ్రామంలో ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. దీంతో తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ నుంచి లింగన్‌పల్లికి వెళ్లే మార్గంలో రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో గ్రామస్తులు నీరు నిలవకుండా చర్యలు తీసుకున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంట చేతికొచ్చిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాగారంలో వడగళ్ల వాన

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో సోమవారం వడగళ్ల వాన కురిసింది. దీంతో వరి పంట నేలకొరిగి ఒడ్లు రాలిపోయాయి. నాగ్‌సాన్‌పల్లి, మైలారం తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో ప్రజలు, రైతులు భయకంపితులయ్యారు. విద్యుత్ వైర్లపై చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కోతకు వచ్చిన వరి పంట దెబ్బతింది.

ప్రధాన రహదారిపై విరిగిపడిన వృక్షం

అనంతగిరి: వికారాబాద్‌లో సోమవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చోట్లు చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్తగడి సమీపంలో ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా ఓ భారీ వృక్షం విరిగి పడింది. దీంతో గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

మల్కాపూర్‌లో చెట్టుపై పిడుగు

తాండూరు రూరల్: మండల పరిధిలో సోమవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి మల్కాపూర్ గ్రామంలోని భవానీ కాలనీలో మునీర్ ఇంటి వద్దనున్న వేప చెట్టుపై పిడుగుపడింది. దీంతో మంటలు చెలరేగి చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఎలాంటి నష్టం వాటిల్లలేదని కాలనీవాసులు చెప్పారు.



తాండూరు రూరల్: భవానీకాలనీలో పిడుగు పడటంతో విరిగిన చెట్టు కొమ్మలు

పంటనష్ట పరిహారంపై నివేదిక

తాండూరు రూరల్: మండల పరిధిలో వర్షానికి నష్టపోయిన పంట వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మండల వ్యవసాయాధికారి కొమరయ్య అన్నారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 11 గ్రామాల్లో వరి, అరటి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. 102 మంది రైతులకు సంబంధించి 198 ఎకరాల్లో పంట నష్టవాటిల్లిందన్నారు. ఒక ఎకరాలో 15 గుంటల భూమి అంటే 33 శాతం పంట నష్టపోతేనే పరిహారానికి ఎంపిక చేశామన్నారు. ఎల్మకన్నెలో 50 ఎకరాలు, బెల్కటూర్‌లో–28, అంతారం–42, కోనాపూర్–ఆరు ఎకరాల్లో, చెన్‌గేస్‌పూర్–22, ఖాంజాపూర్–రెండు ఎకరాలు, చింతమణిపట్నం– ఐదుఎకరాలు, చెంగోల్లో–15, రాంపూర్‌తండా–12, రాంపూర్‌లో ఎనిమిది, సంగెంకలాన్ ఎనిమిది ఎకరాలు పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు.

పిడుగుపాటుకు గేదెలు మృత్యువాత

పరిగి: మండల పరిధిలో సోమవారం కురిసిన వర్షానికి రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. కిష్టమ్మగుళ్లతండాకు చెందిన గంగనోళ్ల శ్రీనివాస్, రంగంపల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లేశ్ రోజు మాదిరిగా పొలం వద్ద గేదెలను కట్టివేశారు. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో చెట్టుపై పిడుగుపడింది. దీంతో చెట్టు కింద కట్టివేసిన గేదెలు మృత్యువాతపడ్డాయి. దాదాపు రూ.80వేల నష్టం వాటిల్లిందని.. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కిష్టమ్మగుళ్లతండాలో గేదె కళేబరం వద్ద రైతు



దోమ: పాలేపల్లి రోడ్డుపై విరిగిపడిన చెట్టు



దోమ: రాకొండలో నేల రాలిన మామిడి

క్లుప్తంగా

మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కార్యవర్గం

అనంతగిరి: మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మొరంగపల్లి అశోక్, ఉపాధ్యక్షుడిగా కె.గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా వరప్రసాద్, సలహాదారులుగా ఆంజనేయులు, నారాయణరావు, సంఘమేశ్వర్, రాంచందర్, మల్లయ్య, సత్తయ్య, ట్రెజరర్‌గా రాంచందర్, మీడియా కన్వీనర్ విజయ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా అనురాధ, మహిళా కార్యదర్శిగా సంతోషికుమారిని ఎన్నుకున్నారు. రానున్న రోజుల్లో జిల్లా క్రీడాకారులు, యువతకు మంచి అవకాశాలు లభించేలా అసోసియేషన్ తరఫున కృషి చేస్తామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

పశువుపై యువకుడి అసభ్య ప్రవర్తన

షాబాద్/మహేశ్వరం: పశువుపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని స్థానికులు పట్టుకొని చితకబాది, పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంఖాల్ గ్రామానికి చెందిన ఓ రైతు.. డెయిరీ ఫాంలో కొన్ని రోజులుగా తన పశువులను కట్టేస్తున్నాడు. ఉదయం చూసే సరికి అవి గుంజ దగ్గరికి కట్టేసి ఉండేవి. ఇది గమనించిన రైతు ఎవరైనా దొంగలు వస్తున్నారా? మరేదైనా కారణం ఉందా అనే అనుమానంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో ఓ యువకుడు గేదేలపై అసభ్యంగా ప్రవర్తించడం రికార్డ్ అయింది. కాపుగాసి సదరు వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది.

పౌరసరఫరాల అధికారికి సన్మానం



పౌరసరఫరాల అధికారిని సన్మానిస్తున్న డీలర్లు

బడంగ్‌పేట్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన పౌరసరఫరాల జిల్లా అధికారిని వనజాతరెడ్డి(డీఎస్‌ఓ)ను సోమవారం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని డీలర్లు కోరారు. ఇందులో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సత్తయ్య, కార్యవర్గ సభ్యులు భానుగౌడ్, విజయ్‌సూర్య, కృష్ణగౌడ్, సందీప్‌గౌడ్, సంఘం మహేశ్వరం మండల అధ్యక్షుడు ఎంఏ సత్తార్, మొయినాబాద్ డీలర్ల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బాలాపూర్ రేషన్ డీలర్లు సురేష్‌గుప్తా, వినయ్‌గౌడ్, రాజుయాదవ్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న కారు

కేతేపల్లి: ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ ఘటన విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ఇస్నాపూర్‌లో నివాసముంటున్న వి.వెంకట్రావు చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తన భార్యతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యలో కొర్లపహాడ్ వద్దకు రాగానే కారు ఏసీలో నుంచి నుంచి పొగలు వచ్చాయి. ఇది గమనించిన వెంకట్రావు దంపతులు కారును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగారు. వెంటనే ఇంజన్‌లో మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే కారుకు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. నకిరేకల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

ఈదురు గాలులకు ఒరిగిన హోర్డింగ్

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో పలుచోట్ల చెట్లు విరిగిపోవడం, స్తంభాలు, హోర్డింగులు పక్కకు ఒంగిపోయాయి. పట్టణంలోని ఎస్‌బీ సూపర్‌మార్కెట్ బిల్డింగ్‌పైన అనుమతిలేని హోర్డింగ్ గాలుల దాటికి ప్రమాదకరంగా ఒరిగింది.

అన్నదాతను ఆదుకునేదెవరు

అకాల వర్షానికి అన్నదాత ఆగమగమవుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయనికి నేలపాలైంది. అప్పు చేసి పంటలకు పెట్టుబడి పెట్టామని ప్రస్తుతం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని కర్షకులు లబోదిబోమంటున్నారు. కోతకు వచ్చిన పంటను చూసి ముసిరిపోయిన రైతు.. ఈదురు గాలులు, భారీ వర్షానికి పంట నేలకొరిగి, వడ్లగింజలు రాలడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

- ఈదురు గాలులు, భారీ వర్షానికి పంట నష్టం
- పెట్టుబడులు సైతం రాని పరిస్థితి
- ప్రభుత్వ నిర్ణయంపై గంపెడాశలు



తాండూరు మండలం అంతారం తండాలో నేలకొరిగిన వరి పంట

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు వరి, కూరగాయలు, మొక్కజొన్న, అరటి పంటలను సాగు చేస్తున్నారు. అంతారం, కోనాపూర్, చెన్‌గేస్‌పూర్, ఖాంజాపూర్, ఎల్మకన్నె, చింతమణిపట్నం, చెంగోల్, రాంపూర్ తండా, రాంపూర్, వీరారెడ్డిపల్లి, గోనూర్, వీరశెట్టిపల్లి, నారాయపూర్‌తో పాటు పలు గ్రామాల్లో యాసంగి సీజన్‌లో 3,750 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. సంగెంకలాన్ గ్రామంలో అరటిపంట, బెల్కటూర్, అంతారంలో కూరగాయలు సాగు చేశారు. మరికొన్ని గ్రామాల్లో మొక్కజొన్న సైతం పండిస్తున్నారు.

ఈదురుగాలులతో నష్టం

ఆయా గ్రామాల్లో ఈ నెల 17వ తేదీన ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వడగళ్ల వాన పడింది. దీంతో చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. వడ్లు గింజలు రాలాయి. మొక్కజొన్న, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంటలు అకాల వర్షానికి పాడవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దేముల్‌లో..

ఈదురు గాలులతో కూడిన వర్షానికి పెద్దేముల్ మండలం జనగాం, మారేపల్లి, మారేపల్లితండా, దుగ్గాపూర్, మంబాపూర్, రుక్మాపూర్ గ్రామాల్లో వరిపంట పూర్తిగా పాడైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒక్కసారిగా కళ్లముందే నష్టపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఎమ్మెల్యేతో మొర

భారీ వర్షానికి పంటలు పాడయ్యాయని ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని పెద్దేముల్ మండలం జనగాం గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. మూడు రోజుల క్రితం తాండూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి తమ బాధను చెప్పుకొన్నారు. వెంటనే ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల పంట వివరాలను సేకరించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ప్రాథమిక నివేదిక సిద్ధం

జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు తాండూరు, పెద్దేముల్ వ్యవసాయశాఖ అధికారులు వర్షానికి పాడైన పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. ఏఓలతో పాటు ఏఈఓలు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించారు. 33 శాతం పంట నష్టపోయిన రైతుల పేర్లను నమోదు చేసి నివేదిక తయారు చేశారు. తాండూరు మండలంలో 198 ఎకరాలు, పెద్దేముల్లో 170 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమిక నివేదిక రూపొందించారు. ప్రభుత్వమే రైతులకు పరిహారం అందజేస్తుందా లేదా ఇంకా ఏవైనా ప్రత్యామ్నాయ మార్గాలు అందజేస్తారా అనే విషయంపై స్పష్టత లేదు.



తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో దెబ్బతిన్న అరటితోట

పోషకాహారంతో ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి

తాండూరు టౌన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం ఎంతో మేలు చేస్తుందని తాండూరు ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం పోషణ పక్షం సంబరాల్లో భాగంగా పట్టణంలోని సాయిపూర్ అంగన్‌వాడీ కేంద్రం –2లో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించాయన్నారు. క్రమం తప్పకుండా అంగన్‌వాడీల్లో అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు ఇస్తున్న బాలామృతం వారికి సరైన ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందన్నారు. గర్భిణిగా ఉన్నప్పటి నుంచి బిడ్డ రెండేళ్ల వయసు వచ్చే వరకు పోషకాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: కోకట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ శ్రీలక్ష్మి

దృష్టి లోపాన్ని నివారించడమే లక్ష్యం

యాలాల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో దృష్టి, పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఐసీడీఎస్ తాండూరు సీడీపీఓ శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కోకట్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుధాకర్, మండల సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, జాహెదా ఉన్నారు.

పరిహారం ఇచ్చాకే పనులు చేయండి

- భూ నిర్వాసితుల డిమాండ్
- అధికారులకు వినతిపత్రాలు

కొడంగల్: పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వకుండా పోలీసు బందోబస్తు నడుమ చేపడుతున్న పనులను వెంటనే ఆపేయాలని భూ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు సోమవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అప్పాయిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 19లో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి తాము భూములు ఇచ్చామని తెలిపారు. మొత్తం పరిహారం చెల్లించకుండానే సర్వే నంబర్ 19లో పోలీసులను పెట్టి పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి తోడు కొంత మంది అర్హులైన రైతులను వదిలేసి, రికార్డుల్లో లేని వారికి పరిహారం చెల్లించారని ఆరోపించారు. ఈ డబ్బులను వెంటనే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. మారుమూల గ్రామాల్లో ఉన్న భూములకు రూ.20 లక్షలు ఇచ్చారని జాతీయ రహదారి పక్కన ఉన్న భూములకు రూ.10 లక్షలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి, తహశీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజనల్ పాలనాధికారికి వినతి పత్రాలు సమర్పించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, శేఖర్ గౌడ్, దొబ్బలి పకీరప్ప, రాములుగౌడ్, నర్సమ్మ, మోతీబాయి, శివమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

నలభై ఏళ్ల ఆత్మీయ బంధం



కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: నలభై ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులందరూ ఒక చోటుకు చేరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1984–85 సంవత్సరానికి చెందిన నాటి పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాటి గురువులతో పాటు విద్యార్థులందరూ హాజరు కావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఎన్నో ఏళ్ల అనుబంధాన్ని ఒకరినొకరు పంచుకుంటూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆసాంతం సంతోషంగా గడిపారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు మహేందర్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరావు, హన్మయ్య, ఆంజనేయులు, విద్యాధికారి హబీబ్‌ను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో అలనాటి విద్యార్థులు పెంటయ్య, రవిచందర్, పద్మ, రాజేశ్వరి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన అముదన్ విజయ్(23) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ కొంపల్లి సెంట్రల్ పార్కు సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. గత కొన్నాళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్న అతను మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం హాస్టల్ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అదే రోజు మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతువేదికలో ఫర్నిచర్ మాయం!



ఫర్నిచర్ లేకుండా ఖాళీగా ఉన్న రైతువేదిక

దౌల్తాబాద్: మండలంలోని చల్లాపూర్ గ్రామంలోని రైతువేదికలో ఉన్న ఫర్నిచర్ మాయమయింది. రైతులకు పంటల సాగులో అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఉపయోగకరంగా ఉంటాయని క్లస్టర్‌కు ఒక రైతు వేదిక నిర్మించారు. వాటిని నిర్మించి అక్కడ రైతులు కూర్చోవడానికి 120 కుర్చీలు, టేబుళ్ల తదితర ఫర్నిచర్‌ను ప్రభుత్వం అందజేసింది. అయితే చల్లాపూర్ రైతువేదికలో మాత్రం ఒక్క కుర్చీ, టేబుళ్లు లేవు. గ్రామం మధ్యలో వేదిక ఉంటే ఫర్నిచర్ ఏమైందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఊరిలోని కొంతమంది నాయకులు, కిందిస్థాయి పలు పార్టీల కార్యకర్తలు తమ ఇళ్లలోకి తీసుకెళ్లారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏఈఓ వినోద్‌ను వివరణ కోరగా.. తాను బాధ్యతలు తీసుకోకముందు నుంచే ఫర్నిచర్ లేదని చెప్పారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శిని అడిగానన్నారు. ఫర్నిచర్ మాయంపై ఏఓకు వివరించానన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



నూతన సభ్యులతో ప్రణయ్

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్


చేవెళ్ల: ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రం అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, దీనికి నిరసనగా రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అరకొర నిధులతో విద్యాభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం అమలు చేయాలంటే దేశ వ్యాప్తంగా రూ.4లక్షల 82వేల కోట్లు అవసరమని, కానీ బడ్జెట్‌లో రూ.125 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. విద్యారంగానికి జరుగుతున్న అన్యాయంపై చర్చించి, భవిష్యత్ పోరాటాల కోసం జిల్లాలో అన్ని స్థాయిల్లో మహాసభలు జరుపుకొని, రాష్ట్ర మహాసభలను ఖమ్మంలో ఈ నెల 25,26,27 తేదీలలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ సభకు విద్యార్థులు, మేధావులు, పుర ప్రముఖులు, ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ..

సమావేశంలో ఫెడరేషన్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు, ఉపాధ్యక్షులుగా సమీర్, యశ్వంత్, వివేకానంద, దిలీప్, సహాయ కార్యదర్శులుగా చరణ్‌గౌడ్, చందు, తేజ, పండు, సోషల్‌మీడియా కన్వీనర్‌గా చిరంజీవి, సాయి గణేశ్, డివిజన్ కమిటీ సభ్యులు దేవేందర్, సాయిగౌడ్, రాహుల్, హరికృష్ణ, బన్నీ, నవీన్, శశాంకను నియమించారు.

నీటి తొట్టే.. మూగజీవాలకు అండ

మండే ఎండలకు జీవరాశి విలవిలాడుతోంది. వేడి తీవ్రతకు ఉత్పన్నమయ్యే దాహార్తికి పశువులు సైతం ఇబ్బంది పడుతున్నాయి. మండల పరిధిలోని ఎన్కేపల్లిలో నీటి తొట్టెను ఆశ్రయించి గేదెలు సేద తీరుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సరిపడా నీటి తొట్టెలను నిర్మించాలని పశుపోషకులు కోరుతున్నారు. – బొంరాస్‌పేట



అల్లర్లు చేస్తే అరెస్టే..!

ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనుల్లో పోలీసులు దూకుడు పెంచారు. పనులకు ఆటంకం కలిగిస్తున్నవారిపై కన్నెర్ర చేస్తున్నారు. అల్లర్లు చేస్తే అరెస్టు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకు యత్నిస్తున్నారు.

వేగంగా ఫార్మాసిటి భూముల సర్వే

- ఫెన్సింగ్ పనుల్లో పోలీసుల దూకుడు
- ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్న వైనం
- పరిహారం ఇప్పిస్తామంటూ అధికారుల భరోసా
- మే లో భూములను పరిశీలించనున్న సీఎం

యాచారం: ఫార్మాసిటీ భూముల వ్యవహారం హాట్ టాఫిక్‌గా మారింది. సేకరించిన భూముల సర్వే, ఫెన్సింగ్ పనుల్లో బాధితులతో పాటు.. పరిహారం పొందిన వారు కూడా తరచూ పనులు అడ్డుకుంటుండంతో సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం, పోలీసులకు ఫుల్ పవర్ ఇచ్చింది. పనులకు ఎలాంటి అడ్డంకి కలిగినా క్షణాల్లో వాలిపోతున్నారు. పది రోజుల క్రితం నక్కర్తమేడిపల్లి గ్రామం నుంచి ఫార్మా భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నుంచి భూములు సేకరించిన రెవెన్యూ శాఖ, డబ్బులు ఇచ్చిన టీజీఐఐసీ కంటే పోలీస్ శాఖనే అప్రమత్తంగా ఉంది. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు బందోబస్తును ఏర్పాటు చేస్తుండగా, సమన్వయ బాధ్యతలను గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు పర్యవేక్షిస్తున్నారు.

పోలీసు పహారాలో..

భూముల సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా.. రాచకొండ సీపీ సుదీర్ బాబు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డీసీపీ పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ, ముగ్గురు ఏసీపీలు, 8 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, మరో వంద మందికి పైగా సిబ్బంది నిత్యం పహారా కాస్తున్నారు. భూములు సేకరించిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని రోడ్లపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఎవరిపై ఎలాంటి అనుమానం వచ్చినా.. అదుపులోకి తీసుకుంటున్నారు. భూసేకరణలో నిజంగానే రైతులకు అన్యాయం జరిగినట్లు తెలిస్తే.. వారి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, కోర్టు కేసులున్న భూముల వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇంటిలిజెన్స్ పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.



నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ మధ్య ఫెన్సింగ్ పనులు పరిశీలిస్తున్న సీఐ కృష్ణంరాజు (ఫైల్)

సీఎంఓ నుంచి పర్యవేక్షణ


ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫ్యూచర్(ఫోర్త్) సిటీని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగానే 14 వేల ఎకరాల భూమికి పక్కగా సర్వే చేసి, ఫెన్సింగ్ పనులు చేపట్టింది. పలు ప్రముఖ సంస్థలకు భూములు అప్పగించడానికి నిర్ణయించిన సర్కార్.. రైతులు, ప్రజల నుంచి ఏ సమస్య రాకుండా సీఎంఓ కార్యాలయం నుంచి నిత్యం పర్యవేక్షిస్తోంది. పోలీస్, రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులకు సూచనలు చేస్తోంది. నెల రోజుల్లో సర్వే, ఫెన్సింగ్ పూర్తి చేయాలని నిర్ణయించింది. కొన్ని నిర్మాణ సంస్థలకు కావాల్సిన భూమిని అప్పగించి, మే చివరి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.



నానక్‌నగర్ గ్రామంలో పనులను పర్యవేక్షిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి (ఫైల్)

రైతులకు భరోసా

భూ సేకరణలో చాలా మంది రైతులకు పరిహారం అందలేదని, నకిలీ పత్రాలతో కొందరు రూ.కోట్లు పొందారని పేర్కొంటున్న పలువురు సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటున్నారు. ఏళ్లుగా కబ్జాలో ఉన్న తమకు అన్యాయం జరిగిందని ఆందోళన చేస్తున్నారు. దీంతో పోలీసులు.. రెవెన్యూ, టీజీఐఐసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. పల్లెచల్కతండాలో 20 మందికి పైగా గిరిజనులు, కుర్మిద్దలో పది మందికి పైగా పేదలు, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లో మరో 40 మందికి పైగా హక్కుదారులమైన మాకు పరిహారం ఇవ్వకుండా, దళారులకు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. ఇదే అంశాన్ని ఏసీపీ కేపీవీ రాజు.. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములను పరిశీలించేలా చేశారు. దీంతో రైతుల్లో భరోసా కలిగి సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకోకుండా కొనసాగించేలా సహకరిస్తున్నారు.



బాధిత రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏసీపీ